# క్రీనీడ

## - వీరభద్రరావ్ పమ్మి

**A rock feels no pain and an island never cries.**
**-Simon and Garfunkel.**

నాకపుడు పదిహేడేళ్ళు.

అప్పటికే మా నాన్న చనిపోయాడు. నాన్న మిగిల్చిన రెండు బాధ్యతలు. నేనూ-అమ్మ. అన్నయ్య లిద్దరూ చెరోటి నెత్తినేసుకున్నారు. నేను పెద్దన్నయ్య దగ్గరుండేదాన్ని. అన్నయ్య చాలా మంచివాడు. మెతక మనిషి కాబట్టి వదిన అన్నయ్యని డామినేట్ చేసేది.

కొంచెం పొట్టిగా ఉన్నా నేను చాలా అందంగా ఉండేదాన్ని. నేను బైటకెడితే మగాళ్ళే కాదు-ఆడాళ్ళు కూడా కన్నార్పకుండా నన్ను చూసేవారు.

నాకు చిన్నప్పట్నుంచి సూర్యోదయం అంటే ఇష్టం. పొద్దున్న ఇంటి ముందు మొక్కల మధ్య నీ రెండలో కూర్చోడం ఇష్టం.

వదిన నన్ను సతాయించేది. ఆరడి పెట్టేది. అందుకని పొద్దున్నే చేటలో బియ్యం-పోసుకుని రాళ్ళు ఏరుతూ నీరెండలో కూర్చునేదాన్ని. పనిచేస్తున్నాను కాబట్టి వదిన ఏమీ అనేది కాదు.

అలా కూచున్నపుడే ఓసారి అతన్ని చూసాను. తెల్లఫ్యాంటు, తెల్ల టీషర్టు, తెల్లటి బూట్లు వేసుకుని అతను మార్నింగ్ వాక్‌కి వెడుతున్నాడు.

మనిషి దబ్బ పండురంగులో పొడవుగా చాలా ఆకర్షణీయంగా ఉన్నాడు. మర్నాడు అతను వచ్చే సమయానికి నేను గేటు దగ్గర నిలబడ్డాను. చూసాను.

మర్నాడు, ఆ మర్నాడు...అలా రోజూ అతన్ని చూసేదాన్ని.

ఓ రోజున చటుక్కున అతను నన్ను చూసాడు.

గుండె ఝల్లుమంది.

వంట్లో నరాలన్నీ షాక్ తగిలినట్టు అయ్యాయి.

ఆ మర్నాటి నుంచి రోజూ అతను వచ్చే సమయానికి నేను గేటు దగ్గర నిలబడటం, అతను నాకేసి చూడడం...

నాలో విపరీతమైన మార్పు వచ్చింది.

రోజూ అతను వచ్చే సమయానికి స్నానం ముగించి చక్కగా తయారయేదాన్ని...

ఇలా కొన్ని నెలలు గడిచాయి.

ఓ ఆదివారం మధ్యాహ్నం అతను మా ఇంటికి వచ్చి అన్నయ్యని కలిసాడు.

అతని పేరు మురళీకృష్ణ. ఏదో కంపెనీలో పెద్ద ఉద్యోగం. పెద్ద జీతం. నన్ను పెళ్ళి చేసుకుంటానని అన్నయ్యని అడిగాడు. కట్నం అక్కర్లేదన్నాడు. మామూలుగా పెళ్ళి చేస్తే చాలన్నాడు.

అన్నయ్య వెంటనే ఒప్పేసుకుంటా డనుకున్నాను. కాని అన్నయ్యని వదిన కళ్ళు వారించాయి.

''మా అమ్మతో సంప్రదించి చెప్తాను.'' అన్నాడు అన్నయ్య. నేను నిరాశపడిపోయాను.

వారం తర్వాత మురళీకృష్ణ మళ్ళీ వచ్చాడు.

''మీ సంబంధం మా కిష్టం లేదు.'' అని అన్నయ్య తరఫున వదిన చెప్పేసింది.

ఆ రాత్రి అన్నయ్య గదిలో ఏడవడం నాకు బైటికి వినిపించింది. ఇంతకీ వదిన ఆ సంబంధం ఎందుకు చెడగొట్టిందో నాకు తర్వాత అర్థమైంది.

నాకు అంత మంచి సంబంధం వచ్చిందన్న అసూయ.

ఆడదానికి ఆడదే శత్రువు!

నేను మురళీకృష్ణని చాలా కాలం మర్చిపోలేక పోయాను. అతను కలలో నన్ను నవ్వించేవాడు. కవ్వించేవాడు. గుండెలమీద మొహం ఆన్చి కళ్ళలోకి చూసేవాడు. నా శరీరంలో ప్రతి అణువుని అతను పలకరించేవాడు. పులకరింపచేసేవాడు.

మరో రెండు సంవత్సరాల తర్వాత నాకు గోవింద రావుతో పెళ్ళి జరిగింది. అతను సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సామాన్య ఉద్యోగి.

ఈనాడు వెనక్కి తిరిగి చూసుకుంటే నేను అతన్ని ప్రేమించనూ లేదు. ద్వేషించనూ లేదు. అతనూ అంతే!

వేడెక్కిన శరీరాల్తో ఇద్దరం కల్సుకున్నపుడు కూడా అతను నన్ను, నా అందాన్ని, నా అవయవాల్ని ఎప్పుడూ పొగడ లేదు. నిజం చెప్పొద్దూ- అతనెపుడూ నాకే లోటూ చెయ్యలేదు. అడిగినవన్నీ కొనిచ్చేవాడు. అడిగితే...

ఎపుడూ నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. ఆ నిర్లిప్తత నన్ను, నా మనసుని కాల్చేసేది.

ప్రైవేటుగా కాస్ట్ ఎకౌంటెన్సీ చదువుకుని, రెండు, మూడు ఉద్యోగాలు మారి చాలా పెద్ద ఉద్యోగంలోకి ఎగబాకాడు. జీతం పెరిగింది. హోదా పెరిగింది.

మనిషి మాత్రం మారలేదు.

అదే నిర్లిప్తత- అదే నిశ్శబ్దం.

పెళ్ళయ్యేక రెండేళ్ళకి ప్రభ, మరో మూడేళ్ళకి సంగీత పుట్టారు. నాకు పిల్లలే లోకమైపోయింది. వాళ్ళ ఆలనా పాలనా...వాళ్ళ చదువులు, హోంవర్కులు, బట్టలు, ముస్తాబు...ఇదే లోకం.

మా ఆయన పిల్లల్ని కూడా పట్టించుకునే వాడు కాదు. అలాగని వాళ్ళకెపుడూ లోటు చెయ్యలేదు. వాళ్ళు ఏమడిగినా కొనిపెట్టేవాడు. వాళ్ళ కోసం ఎంత డబ్బయినా ఖర్చు చేసేవాడు.

మా ఆయన ధోరణికి ఓ మంచి ఉదాహరణ చెప్తాను.

నాపుట్టిన రోజు వస్తే ''రేపు నా పుట్టిన రోజు'' అనే దాన్ని.

వెంటనే రెండువేలో, మూడు వేలో చేతులో పెట్టి ''నీ క్కావల్సిన చీర కొనుక్కో'' అనేవాడు.

తనకి నచ్చిన చీర కొనుక్కొచ్చి చేతిలో పెడితే బావుండునని నాకు ఉండేది.

పెళ్ళయిన మొదట్లో అతను మారతాడని, నిర్లిప్తభావం లోంచి బైట పడతాడని ఆశించాను.

పిల్లలు పుట్టాక ఆశించడం మానేసాను.

చెప్పానుగా- నాకు పిల్లల్తోటే లోకమైపోయింది.

అలా కొన్నాళ్ళు, కొన్నేళ్ళు గడిచిపోయాయి.

నాకు పెళ్ళయిన పద్దెనిమిదేళ్ళకి- అంటే అప్పటికి నాకు ముప్పై ఏడేళ్ళు- ప్రభకి పదహారేళ్ళు. సంగీతకి పదమూడేళ్ళు. మా ఆయన జబ్బు చేసి చచ్చి పోయాడు.

నిజం చెప్పొద్దూ- అప్పట్లో జీవితంలో అతి ముఖ్యమైన వ్యక్తి మరణించాడనేకన్నా, వైధవ్యం సంప్రాప్తించిందని అన్నా డబ్బుతో ముడిపడ్డ ఈ ప్రపంచంలో నేనెలా బతకాలి...ఈ పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చేసి చదివించి పెళ్ళిళ్ళు చెయ్యాలి అన్న ప్రశ్నలే నన్ను ఎక్కువగా కలవర పరిచాయి.

మనం చెప్పుకునే ఆప్యాయతల కన్నా, ఆర్థికబాధలే మనిషి ఆలోచనల్ని నియంత్రిస్తాయని అప్పట్లో నాకు తెలియవచ్చింది.

మా ఆయన చనిపోయాక ఆయన కంపెనీ వాళ్ళు నాలుగు లక్షలు తీసికొచ్చి ఇచ్చారు. ఇన్సూరెన్స్ కంపెనీవాళ్ళు అయిదులక్షలు ఇచ్చారు. ఇది కాకుండా ఆస్థిలో మా ఆయన వాటా అంటూ మా బావగారో రెండు లక్షలు ఇచ్చారు.

నిజానికి ఇంత డబ్బు వస్తుందని నేను ఊహించలేదు.

ఓ ఇల్లు కొన్నాను. మిగిలిన డబ్బు బ్యాంకులో వేశా. నెలనెలా వడ్డీ వచ్చేది. దాంతో మా కుటుంబం హాయిగా

గడిచిపోయేది.

ఆడ పిల్లలిద్దరికీ ఆప్యాయత విషయంలో ఏలోటూ రాకుండా చూసుకునేదాన్ని. వాళ్ళ నాన్న బతికున్నన్నాళ్ళు ఎటువంటి ఆప్యాయత చూపించ లేదు.

ఇపుడు మనిషే లేడు.

నా ఉద్దేశ్యంలో ఏ మనిషికైనా బాల్యం బావుండాలి. అంటే బాల్యంలో అన్ని సుఖాలు అమరాలని కాదు. బాల్యంలో ప్రేమ, ఆప్యాయత, అభినందన వాళ్ళకి పూర్తిగా అందాలి. మనిషి తర్వాత ఎలా రూపొందుతాడు అన్నది బాల్యం మీదే ఆధారపడి ఉంటుంది.

నా పిల్లలు బాగా చదువు కునేవారు.

ఎప్పుడూ హుషారుగా, ఆనందంగా ఉండేవారు.

పిల్లలు చక్కగా పెరిగి పెద్ద వాళ్ళవుతున్నారు. ఆర్థికపర మైన ఇబ్బందులు లేవు. నాకు బోలెడు ఖాళీ సమయం దొరికేది.

మెల మెల్లగా నా మనసులో మార్పు మొదలైంది.

మనసులో ఏ దాపరికాలు లేకుండా నిజం చెప్తున్నాను.

మనసు ఓ మగతోడు కోసం, శరీరం మగ పొందుకోసం తహతహ లాడ్డం మొదలెట్టా యి. వంట్లో నరాలు తీయగా మూలగడం మొదలెట్టాయి.

అవును. నా భర్త చనిపోయే నాటికి నా వయసు ముప్ఫై ఏడేళ్ళు.

నేను జన్మంతా మోడువారిన జీవితం గడపాలా...

మనసుని ఎంత పక్కకి మరల్చుకుందామనుకున్నా అవే ఆలోచనలు...

మనసుని దైవభక్తి వైపు, వేదాంతం వైపు మరల్చుకుందా మని చాలా ప్రయత్నించాను. చన్నీటి స్నానాలు చేసేదాన్ని. పిల్లలమీద మనసు లగ్నం చెయ్యడానికి ప్రయత్నించాను.

నిజం చెప్పొద్దూ-నాకు మొదట్నుంచీ సెక్స్ కోరిక ఎక్కువే!

మా ఆయన బతికున్న రోజుల్లో మనసు తృప్తి పడ కపోయినా శరీరం తృప్తిపడేది.

కానీ మనసు, శరీరమూ రెండూ శిక్షించడం మొదలె ట్టాయి. అంతమాత్రం చేత నేను వివాహేతర సంబంధం గురించి ఆలోచించలేదు. అలా ఆలోచిస్తే నా అందానికి మగాడు దొరక్కపోడు.



ఎవరైనా నన్ను పెళ్ళి చేసుకుంటారేమోనని ఆశపడేదాన్ని. కాని ఆరోజుల్లో ఇద్దరు పిల్లలున్న విధవరాల్ని పెళ్ళాడేందుకు ఎవరూ సిద్ధంగా లేరు.

ఎవరేనా సిద్ధంగా ఉన్నా అతని వివరాలు నాకు, నా వివరాలు అతనికి తెలిసే అవకాశం లేదు.

నా పెళ్ళి ఆలోచన గురించి ఓసారి మా అమ్మతో అంటే ''పిదప కాలం బుద్ధులు'' అనేసింది.

మా నాన్న పోయాక తాను తన మనసుని, శరీరాన్ని ఎలా అదుపులో పెట్టుకోగలిగిందో వివరించి చెప్పిం ది. భక్తి అలవరచుకోమంది. 'నా నుదుటున దేవుడు ఇంతే రాసాడు' అనుకోమంది.

ఆడదానికి ఆడదే శత్రువు.

మనసు, శరీరం సృష్టించే అలజడి ని భరించాను. భరించక వేరే దారి లేదు. రాత్రిళ్ళు నిద్ర పట్టేది కాదు. పట్టినా అస్తమాను మెలకువ వచ్చేది. శరీరంలోని అవయవాలన్నీ సమ్మె చేసేవి. గుండెలు ఎగిసెగిసి పడేవి. శరీరం లోని నరాలన్నీ షాక్ తగిలినట్టుగా ఉండేవి. మెదడు మొద్దుబా రి పోయేది.

చిన్న వయసులో భర్తపోయిన వాళ్ళందరూ ఎపుడో ఒకపుడు ఇలాంటి చిత్రవధ అనుభవించే ఉంటారు. కానీ చిత్రంగా ఎపుడూ బైటికి చెప్పుకోరు.

ఇంత గొప్ప ఉన్నతి కలిగిన మన సంప్రదాయం మొదట్నుంచీ స్త్రీ లకి వ్యతిరేకంగానే ఉంది.

చిన్న వయసులో భర్తపోయిన ఆడది జీవితాంతం పవిత్రంగా ఉండాలి. వీరేశలింగంగారి జయం తులు చేస్తున్నాం గాని వితంతువుని, అందులో పిల్లలున్న వితంతువుని పెళ్ళి చేసుకునే మొనగాళ్ళెందరు ఉన్నారు?

ఏకారణంగానైనా ఆడదానికి పెళ్ళి కాకపోతే ఆమె జీవితాంతం పవిత్రంగా ఉండాలి.

ఇంత క్రూరత్వం ఏ సమాజం లోనూ లేదు. ఆడదాన్ని, ఆమె పవిత్రతను నియంత్రించే దుష్ట సాంప్రదాయం మరే సమాజం లోను లేదు.

ఈ సమాజంలో వాళ్ళు మను షులుకారు-రాక్షసులు, దుర్మార్గులు, పిశాచాలు.

ఇలా ఉండేవి నా ఆలోచనలు.

మనసుని, శరీరాన్ని అదుపులో పెట్టుకున్నానని గొప్పలు చెప్పుకోను గాని మగతోడు లేకుండా బతకడం అలవాటైపోయింది.

నా పిల్లలిద్దరూ బాగా చదువుకున్నారు. పైగా అందగత్తెలు.

ఇరవై ఒకటో సంవత్సరం నిండగానే ఇద్దరికీ వాళ్ళయిష్టంతోనే వాళ్ళకి నచ్చిన కుర్రాళ్ళతో పెళ్ళిళ్ళు

చేసేసాను.

ఇద్దరూ చేరోచోట ఉంటారు. కొన్నాళ్ళు పెద్దమ్మాయి దగ్గర, కొన్నాళ్ళు చిన్నమ్మాయి దగ్గర ఉండాలని నిర్ణయించుకున్నాను. ఆది వాళ్ళ కోరిక కూడా.

నిజం చెప్పొద్దూ. పిల్లలిద్దరికీ నామీద ప్రేమ ఉంది. చిన్నపుడే తండ్రిపోతే శ్రద్ధగా, ఆప్యాయంగా, ప్రేమగా పెంచి పెద్ద చేసానని వాళ్ళకి కృతజ్ఞతతో కూడిన అభిమానం ఉంది. అల్లుళ్ళు కూడా చాలా మంచి వాళ్ళు.

నేను పెద్దమ్మాయి దగ్గర ఉన్నపుడే ఓ విచిత్ర సంఘటన జరిగింది. జీవితంలో ఎంత మార్పు వచ్చినా ఎన్ని ఆటు పోటులు వచ్చినా నాకు సూర్యోదయం అంటే ఉన్న ఇష్టం అలానే ఉండిపోయింది.

ఓ రోజు ఉదయం ఇంటి ముందు మొక్కల్లో కుర్చీలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాను. ఓ వ్యక్తి తెల్లపాంటు, తెల్ల టీషర్టు, తెల్లటి బూట్లు వేసుకుని మా ఇంటి ముందు నుంచి మార్నింగ్ వాక్‌కి వెడుతున్నాడు. అతను అచ్చం మురళీకృష్ణలా ఉన్నాడు. వెనకనుంచి చూడడం వల్ల అతనోకాదో అన్న అనుమానం కలిగింది. పిలుద్దామని గేటు దాకా వెళ్ళాను. తీరా పిలిచాక అతను కాకపోతే....

అతను దూరం వెళ్ళిపోయాడు. నేను గేటుకి చేతులానుకుని అలాగే ఉండిపోయాను.

గతమంతా కళ్ళముందు కదిలింది.

అతన్ని పెళ్ళి చేసుకోలేక పోయానన్న దిగులు మళ్ళీ కలిగింది.

వాకింగ్‌కి వెళ్ళిన మనిషి పది నిముషాల్లో వెనక్కి తిరిగి వచ్చాడు.

ఈసారి అతన్ని స్పష్టంగా పోల్చుకు న్నాను. అతను మురళీ కృష్ణే! గేటు తీసుకుని బైటికి వెళ్లి చేతులూపుతూ పిలిచాను.

అతను నన్ను గుర్తు పట్టాడు.

దూరం నుంచే మొహం పెద్దది చేసుకుని నవ్వుతూ దగ్గరకి వచ్చాడు.

దగ్గరకి రాగానే ''ఇలా సినిమాల్లో, నవలల్లో జరుగుతుంది. అలాంటి ది....అలాంటిది....''

ఆనందంతో గొంతు పూడి పోవడం నాకు స్పష్టంగా తెలిసింది.

లోపలికి పిల్చాను. మా అమ్మాయికి, అల్లుడికి పరిచయం చేసాను.

ఎంతో ఆప్యాయంగా, ఆనందంగా మాట్లాడాడు.

అతనికీ ఇద్దరు పిల్లలుట. అమ్మాయి మొగుడితో అమెరికా వెళ్ళిపోయిందట. కొడుకు సౌదీ అరేబియాలో ఉన్నాడట.

అవీ ఇవీ మాట్లాడుకున్నాక ''మీ ఆవిణ్ని ఎపుడు చూపిస్తారు?'' అనడిగాను.

అతను నిర్వేదంగా నవ్వి. ''లేదు. ఆవిడ చనిపోయింది. ఇరవై ఏళ్ళయింది. పిల్లలిద్దర్నీ నేనే పెంచాను.'' అన్నాడు.

నాకు జాలేసింది.

మా ఆయన చనిపోతే ఒక్కదాన్ని కష్టపడి పిల్లల్ని పెంచి పెద్ద చేసానని ఇన్నాళ్ళు చాలా గర్వంగా అనుకునేదాన్ని.

అలాంటిది భార్య పోతే ఉద్యోగం చేసుకుంటూ ఒక్కడూ ఇద్దరు పిల్లల్ని పెంచి పెద్ద చేసాడు. మురళీ కృష్ణ ఎంత గొప్పవాడో అనిపించింది.

ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేకపోయినా ఓ కంపెనీకి సలహాదారుడిగా ఉంటున్నాట్ట. సంపాదించేదంతా అనాథాశ్రమాలకి ఇచ్చేస్తాట్ట.

మనిషిగా ఎంత ఉన్నతుడో అనిపించింది.

ఆరోజు నుంచి మేం రోజూ కల్సుకోవడం మొదలెట్టాం. మా అమ్మాయి, అల్లుడు ఆఫీసు కెళ్ళిపోయాక అతను వచ్చేవాడు.

ఎంతో హుషారుగా, ఆనందంగా, ఎపుడూ తుళ్ళిపడుతూ ఉండేవాడు. భార్య మరణం, పిల్లల బాధ్యతలు అతన్ని ఏమాత్రం కుంగదీయలేదు.

రాను రాను నా మనసులో మార్పురావడం మొదలైంది. అతను వచ్చే సమయంలో ఎదురుచూడటం, మంచి చీర కట్టుకుని తయారవడం, అలంకరించుకోడం, అతను రావడం కొద్దిగా ఆలస్యమైతే గుండె కొట్టుకోవడం...

ఒక్కదాన్ని ఉన్నపుడల్లా అతని గురించే ఆలోచించడం...

మెల్లమెల్లగా అతనితో సినిమాలకి, పార్కులకి, హోటళ్ళకి వెళ్ళడం మొదలెట్టాను. ఈ విషయాలన్నీ మా పెద్దమ్మాయికి చెప్పాలా వద్దా అని కొన్నాళ్ళు సంశయించాను.

తర్వాత్తర్వాత సూటిగా కాకపోయినా- అర్థోక్తితో చెప్పడం మొదలెట్టాను. మా ప్రభ కొంచెం గుంభమైన మనిషి. పైకి ఏవీ తేలేది కాదు- అలా కొన్నాళ్ళు జరిగింది.

మరికొన్ని రోజులు గడిచాక ''ఏం చేస్తావో నాకు తెలియదు. నాలుగురోజులు మనిద్దరం కలిసి ఎక్కడికైనా వెళ్ళాలి. ఇది నా కోరిక.'' అన్నాడు మురళీ కృష్ణ.

నాకూ అతనికి ప్రతిపాదన ఇష్టమే.

అతనితో ఒంటరిగా గడపాలని నాకూ చాలా కోరికగా ఉంది. ఓ వారం రోజులు రాత్రి పగలు ఆ విషయమే ఆలోచించాను.

జీవితంలో నా మనసుకి సంబంధించి ఏ కోరికా తీరలేదు. కనీసం ఇదేనా తీరితే బావుండునని కోరుకున్నాను.

ఆలోచించి, ఆలోచించి చివరకి ఆశ్రమానికి వెడుతున్నానని మా అమ్మాయికి, అల్లుడికి చెప్పాను. ఎపుడేనా తెల్సున్న ఓ ఆశ్రమానికి వెళ్ళడం, నాల్గురోజులుండి రావడం నాకు మామూలే. చిన్నమ్మాయికి కూడా ఫోన్ చేసి అదే విషయం చెప్పాను.

తీరా నేను బైల్దేరేరోజు మా పెద్దమ్మాయి ''జాగ్రత్తగా వెళ్ళిరా!'' అంటుంటే దాని కళ్ళలో ఏదో అనుమానం కనిపించింది నాకు.

మనిషి తనకి తెలియకుండా ఎన్ని సంకెళ్ళలో చిక్కుకు పోతాడు? ముఖ్యంగా ఆడది. చిన్నపుడు తల్లిదండ్రులకి, పెళ్ళయ్యాక మొగుడికి, తర్వాత స్వంత పిల్లలకి...అన్ని టికీ మించి సంఘానికి.. భయ పడాలి.

భయం-భయం-భయం

భయం బతుకు బతకాలి.

మానవుడు పుట్టుకతో స్వేచ్ఛాజీవి. తర్వాత అన్ని వైపులా సంకెళ్ళే!

ఎంత గొప్ప వాక్యం.

నేను మురళీకృష్ణతో కలిసి విమానంలో బెంగుళూరు వెళ్ళాను. అక్కడొక ఫైవ్‌స్టార్ హోటల్లో దిగాం. మొదటిరోజు పగలంతా కబుర్లు చెప్పుకున్నాం. చీకటి పడ్డాక అలా షికారుకి వెళ్ళాం.

ఓ పార్కులో కూర్చున్నాం.

''మీ భార్య చనిపోయి ఇరవై ఏళ్లై ౹ంది కదా- మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు?'' అనడిగాను.

అతనో క్షణం ఆలోచించి ''రక రకాల-కారణాలు న్నాయి. ముఖ్యంగా నా భార్యే నన్ను విపరీతంగా ప్రేమించింది. అంతటి ప్రేమమూర్తి మళ్ళీ దొరక లేదు.'' అన్నాడు.

నిజం చెప్పొద్దూ- నాక్కొంచెం అసూయ కలిగింది. కోపం కూడా



## చక్రవర్తి తపన

గడ్డం చక్రవర్తి అని పిలవబడే జె.డి.చక్రవర్తికి తెలుగులో సినిమాల్లేవు. ప్రస్తుతం అతడికి రాంగోపాల్‌వర్మ సొంతసినిమా 'సత్య' మాత్రమే చేతిలో ఉంది. చక్రి మంచి నటుడే. మరి అతడికి తెలుగులో సినిమాలు లేకుండా పోవడానికి కారణం ఏమిటి?! ఈ విషయమే ఓ యువదర్శకుడిని కదిలిస్తే ఇలా చెప్పుకొచ్చాడు. ''అమ్మో! కొత్తదర్శకులెవరయినా చక్రవర్తిని హీరోగా పెట్టుకుంటే కష్టమేనండీ బాబూ! అతడికి డైరెక్షన్ చేయాలనే తపన చాలా ఉంది. రాము, రాఘవేంద్రరావు, కృష్ణారెడ్డిగార్ల దగ్గర చెప్పినట్టు చేసే అతడు కొత్తదర్శకుల దగ్గర వీరవిజృంభణ చేసేసి 'ఆ సీన్ ఇలా చేద్దాం, ఆ సీన్ అలా చేద్దాం' అంటూ చంపుకుతింటాడు.'' చక్రవర్తికి సినిమాలు తగ్గడానికి ఇదే పూర్తికారణం కాకపోయినా, ఓ ముఖ్యకారణం. ఒక సినిమా దర్శకత్వం చేస్తే అతడి తపన తీరిపోతుందనుకుంటే 'మహాత్మాగాంధీ ఆటో బయోగ్రఫీ' మూలబడిందాయె!...అతడి దర్శకత్వం ఏ స్థాయిలో ఉంటుందో తెలిసి వర్మ నచ్చచెప్పినా, ఇంకా చక్రవర్తికి ఆ తపన తీరినట్లు లేదు. ఆ తపన తన కెరీర్‌కెంత కీడు చేస్తుందో తెలుసుకోవడమూ లేదు.

-జె.వి.బాబు

వచ్చింది.

''నీకూ బాధ్యతలు లేవు- నాకూ బాధ్యతలు లేవు. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం.'' సడెన్‌గా అడిగాడు.

నేనలాంటి ప్రశ్న ఎదురు చూడలేదు.

అంటే అతని భార్యంతటి ప్రేమమూర్తి నాలో దొరికిందా? మనసులో అనుకున్నాను.

నాకు గర్వంగా అనిపించింది.

అయినా వెంటనే అతనికి సమాధానం చెప్పలేకపోయాను. నవ్వి ఊరుకున్నాను.

ఆ రాత్రి కబుర్లు చెప్పుకుంటూ, టి.వి. చూస్తూ పదకొండు గంటల దాకా మెలకువగా ఉన్నాం.

మురళీకృష్ణ కబుర్లు చెప్తూ అలానే నిద్రపోయాడు.

లైటు ఆర్పేసి-టి.వి. ఆఫ్ చేసి మంచం మీద ఒరిగాను. ఏ.సి. చల్లగాలి వళ్ళంతా తగుల్తోంది.

మురళీకృష్ణ కనిపించిన రోజు నుంచే మనసులో అలజడి ప్రారంభమైంది. ఆ రాత్రి హోటల్ గదిలో శరీరంలో అలజడి ప్రారంభమైంది. బెడ్‌లైటు వెలుగులో అతని మొహంలోకి చూసాను. ప్రశాం తంగా, ఏ సమస్యలూ లేని యోగిలా నిద్రపోతున్నాడు.

అతను నన్ను ఇంత దూరం ఎందుకు తీసుకువచ్చినట్టు? మనసులో మాటలు చెప్పుకో డానికా? పెళ్ళి ప్రపోజల్ చెప్పడానికా? మానసిక ప్రశాంతత కోసమా?-ఎందుకు?

అతని భార్య చనిపోయి ఇరవై యేళ్ళయింది. ఈ ఇరవైయే ళ్ళలోను అతను మరో ఆడదాని పొత్తుకోర కుండా అలాగే ఉండి పోయాట్ట. అతను కోరుకుంటే కోటిమంది....

మరెందుకు అలా ఉండిపోయాడు.

మా ఆయన పోయిన కొత్తలో నేనే శరీరాన్ని, మనసుని అదుపులో పెట్టుకోలేకపోయానే?

మరి అతను?

ఏవేవో ప్రశ్నలు మనసులోంచి బైటికి వస్తున్నాయి. కళ్ళుమూసు కుని పడుకున్నాను. మనసు, శరీరం ఎదురు తిరగడం ప్రారం భించాయి.


ఏదో కఠినమైన నిర్ణయం తీసుకోవాలి.

ఈ క్షణం చేతిలోంచి జారిపోతే మళ్ళీ దొరక్కపోవచ్చు. మరుక్షణానికి నా ఆలోచనే మారిపోవచ్చు. ఏమో? ఏక్షణంలో ఏం జరుగుతుందో?

బెడ్ లైటు ఆర్పేసి అతని మంచం మీదకి చేరాను.

తర్వాత కాసేపటికి-

బట్టలు కట్టుకుందామని మంచం దిగాను. మురళీ కృష్ణ కిందకి వంగి నా



పాదాలు స్పృశించాడు.

బెంగుళూరులో మేం ఉన్న వారం రోజులు ''పగలే వెన్నెల-జగమే ఊయల'' అయ్యాయి మా జీవితాలు.

ఇంటికి తిరిగొచ్చాక మా అమ్మాయి లిద్దర్నీ కూర్చోబెట్టి మురళీకృష్ణతో పెళ్ళి విషయం కదిపాను.

ఇద్దరూ ఆశ్చర్యపోతారనుకున్నాను. అలాంటి దేం లేదు. బహుశా వాళ్ళు ముందే ఊహించి ఉంటారు.

ఇద్దరూ కాసేపు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉన్నారు.

కాసేపటికి చిన్నమ్మాయి ''నువ్వు సుఖంగా ఉండాలి. కాదనం. కాని...ఈ వయసులో నువ్వు పెళ్ళి చేసుకుంటే- మా భర్తలు, మా అత్తవార్లు, మా స్నేహితులు...వీళ్ళంతా ఎలా రియాక్ట్ అవుతారో కొంచెం ఆలోచించు. నువ్వు తీసుకునే నిర్ణయం మా జీవితాల మీద ప్రభావం చూపిస్తుందేమో?

నువ్వు పెద్దదానివి. ఆలోచించి నిర్ణయం తీసుకో''

అంది. చిన్నమ్మాయి చెప్పడం పూర్తవగానే ఇద్దరూ లోపల గదిలోకి వెళ్ళిపోయారు.

వాళ్ళిద్దరికీ నా పెళ్ళి ఇష్టం లేదని స్పష్టంగా తెలిసి పోయింది.

ఆడదానికే ఆడదే శత్రువు.

ఇపుడు నేనేం నిర్ణయించుకోవాలి?

బాగా ఆలోచించాను. ఒక రోజు....రెండు రోజులు....మూడురోజులు....పది రోజులు ఆలోచించాను.

నేను మురళీ కృష్ణని పెళ్ళి చేసుకుంటే నా కూతుళ్ళతో అన్ని రకాల సంబంధాలు తెంచేసుకుని వెళ్ళిపోవాలి.

అలా వెళ్ళిపోతే.....

నేను మురళీకృష్ణ చిన్నపిల్లలం కాదు. ఓ పదేళ్ళకో, ఇరవైయ్యేళ్ళకో ఒకళ్ళ తర్వాత ఒకరం ఇద్దరమూ చచ్చిపోతాం.

నేను ముందు చనిపోతే ఫరవా లేదు....అతనే ముందు పోతే....ఆ వృద్ధాప్యంలో నేను ఒంటరి దాన్నయిపోతాను. అపుడు మళ్ళీ నా కూతుళ్ళ పంచన చేరాలి. ఓసారి వాళ్ళని కాదనుకుని వెళ్ళిపోయాక మళ్ళీ ఏ మొహం పెట్టుకుని వాళ్ళ దగ్గరకి చేరాలి?

ఇదే విషయం మురళీకృష్ణకి చెప్పాను.

నేను చెప్పిందంతా విని ''నువ్వు చెప్పేదాంట్లో అర్థం ఉంది. లేదనను. బాగా ఆలోచించుకో-నువ్వు ఎపుడు వస్తానన్నా నా జీవిత కవాటాలు తెరుచుకునే ఉంటాయి.'' అన్నాడు అతను.

అతని స్నేహితులు కొందరు కలకత్తా దగ్గర్లో ఓ పెద్ద ఫ్యాక్టరీ కడుతున్నారట. మురళీకృష్ణని టెక్నికల్ ఎడ్వయిజర్‌గా తీసుకున్నారు. ఇది సంవత్సరం క్రితమే నిర్ణయమైపోయింది.

అతను కలకత్తా వెళ్ళిపోతూ తన ఫోన్ నంబరు నాకిచ్చి ''ఎప్పటికేనా నీ మనసు మారితే నాకు ఫోన్ చెయ్యి. వెంటనే వచ్చి నిన్ను తీసికెడతాను.'' అని చెప్పి వెళ్ళిపోయేడు.

ఇది జరిగి రెండేళ్ళయింది.

అపుడపుడు...

ఇంట్లో ఎవరూ లేని సమయంలో మురళీకృష్ణ నంబర్‌కి ఫోన్ చేస్తాను. ఫోను రింగవుతూంటుంది. అవతల మనిషి 'హలో' అనే లోగా కట్ చేస్తాను.

నాకిదో ఆట అయిపోయింది.


నా మనసుతో నే నాడుకునే క్రీడ అయిపోయింది.

నా క్రీనీడతో నేనాడుకునే క్రీడ!

నాకు తెలుసు: నాకు నేనే శత్రువుని!

★

## రజనీ ఔదార్యం!



రజనీకాంత్ మరోసారి తన ఉదారతను నిరూపించుకున్నాడు. గతంలో ఒకనాటి తన మిత్రులకోసం 'వళ్లి' చిత్రాన్ని, ఆ తరువాత తమిళ ఇండస్ట్రీలోని ఎనిమిదిమంది సీనియర్ నటీనటుల కోసం 'అరుణాచలం' తీసిన రజనీ ఈసారి అంగవికలుర సహాయార్థం ఓ చిత్రాన్ని నిర్మించ తలపెట్టారు. సంవత్సరానికి ఒక చిత్రం మించి నటించనన్న రజని సరికొత్త చిత్రం ప్రస్తుతం కధాచర్చల్లో వుంది. దర్శకుని ఎంపిక కూడా జరిగిపోయింది. రజనీకాంత్ సంవత్సరానికి ఒక చిత్రంలో నటిస్తున్నా ఆ ఒక్కటీ ఎవరో కొందరి సహాయార్థం నిర్మించడం చెప్పుకోదగిన విషయం. అతడిలో వున్న సహాయ గుణమే తన ఇమేజ్‌ని చెక్కు చెదరకుండా నిలబెడుతుందేమోననిపిస్తోంది. ప్రజలు తమకిచ్చిన స్టార్ ఇమేజ్‌ని తమ్ముళ్లకోసం, బావమరుదుల కోసం మాత్రమే ఉపయోగించి సొమ్ము చేసుకోకపోతే మన తెలుగు ప్రముఖ హీరోలు కూడా మరీ రజనీలా కాకపోయినా అప్పుడప్పుడయినా కష్టాలలో వున్నవారి కోసం ఓ సినిమా చేసి పెట్టవచ్చుకదా? వీళ్లలా చేయరుగాక చేయరు. అందుకే ఇక్కడ అప్పుడప్పుడు ఫలానా హీరో పనయిపోయింది అని వినిపిస్తూ వుంటుంది.

-జె.వి.బాబు